BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 03 మార్చి 2026 | www.balagamtv.com | పేజీలు 4






పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు
హోలీ శుభాకాంక్షలు


# భారత్--కెనడా సంబంధాలకు కొత్త ఊపిరి

## 1.9 బిలియన్ డాలర్ల యురేనియం ఒప్పందం



- 2030 నాటికి 50 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం
- వ్యూహాత్మక విశ్వాస పునరుద్ధరణకు మోదీ--కార్నీ భేటీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

భారత్--కెనడా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపిరి లభించింది. సోమవారం జరిగిన ఉన్నతస్థాయి చర్చల అనంతరం, భారత అణు విద్యుత్ రియాక్టర్ల కోసం 1.9 బిలియన్ డాలర్ల విలువైన, 10 సంవత్సరాల యురేనియం సరఫరా ఒప్పందంపై ఇరు దేశాలు అంగీకరించాయి. ఇదే ఏడాదిలో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంను ఖరారు చేయాలని నిర్ణయించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీల మధ్య న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్లో ఈ సమావేశం జరిగింది. గత కొన్నేళ్లుగా ఉద్రిక్తతలకు లోనైన ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించేందుకు "వ్యూహాత్మక విశ్వాసం" నెలకొల్పడమే ఈ భేటీ లక్ష్యమని ఇరు పక్షాలు పేర్కొన్నాయి.

**యురేనియం--శక్తి రంగాల్లో భాగస్వామ్యం**

సమావేశం అనంతరం ఇరు దేశాలు పునరుత్పాదక ఇంధనం, ఎల్పీజీ, యురేనియం సరఫరా రంగాల్లో 'స్ట్రాటజిక్ ఎనర్జీ పార్ట్నర్షిప్'ను ప్రకటించాయి. కీలక, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో సహకారం పెంపొందించుకోవాలని నిర్ణయించాయి. విద్య, సంస్కృతి రంగాల్లో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. సీఈపీఏ లేదా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం 'టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్'ను కూడా విడుదల చేశారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.అదేవిధంగా, కెనడా భారత్ నేతృత్వంలోని అంతర్జాతీయ సౌరశక్తి కూటమి, గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిల్లో సభ్యత్వం పొందాలని నిర్ణయించింది.

అయితే కెనడా--ఖలిస్తానీ కార్యకర్త హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి వివాదం పూర్తిగా సద్దుమణగలేదు. వాంకూవర్లోని భారత కాన్సులేట్కు చెందిన ఇద్దరు అధికారులపై అనుమానాలు ఉన్నాయని కెనడా దర్యాప్తు సంస్థలు భావిస్తున్నట్టు నివేదికలు వెలువడ్డాయి. ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. ప్రధాని కార్నీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, 'ట్రాన్స్నేషనల్ రిప్రెషన్'ను ఎదుర్కొనేందుకు కెనడా కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# యుద్ధం తీవ్రతరం

- ఇరాన్లో 555 మంది మృతి
- దాడులకు గురైన 131 నగరాలు
- గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడిన ఇరాన్
- కువైట్లో కూలిన అమెరికా యుద్ధ విమానాలు
- ఖమేనీ భార్య మన్సౌరే ఖోజాస్తే మృతి



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఇరాన్, యూఎస్ఏ, ఇజ్రాయిల్ సంయుక్త వైమానిక దాడులు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు కనీసం ఇరాన్లో 555 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 131 నగరాలు దాడులకు గురైనట్లు ఆ సంస్థ తెలిపింది. దీంతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ఉత్కంఠభరితంగా మారింది.అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు ఇరాన్లో కీలక సైనిక, వ్యూహాత్మక లక్ష్యాలపై కచ్చితమైన వైమానిక దాడులు కొనసాగిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఇరాన్ ప్రతీకారంగా క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయెల్తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటోంది. కువైట్లోని అమెరికా రాయబారి కార్యాలయ సముదాయంపై కూడా క్షిపణి దాడి జరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

తమ అణు కార్యక్రమానికి కేంద్రంగా భావించే Natanz Nuclear Facilityపై దాడులు జరిగాయని ఇరాన్ ఆరోపించింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ అణు సంస్థకు ఇరాన్ రాయబారి Reza Najafi తెలిపారు. "శాంతియుత అణు కేంద్రాలపై అమెరికా--ఇజ్రాయెల్ అక్రమ దాడులు జరుపుతున్నాయి. అణ్వస్త్రాలు తయారు చేస్తున్నామని చెప్పడం పూర్తిగా అబద్ధం" అని ఆయన ఖండించారు. అయితే ఐఏఈఏ మాత్రం ఇప్పటివరకు అణు కేంద్రాలకు నష్టం జరిగినట్లు ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

యుద్ధం ఇరాన్కే పరిమితం కాకుండా ప్రాంతీయంగా విస్తరిస్తోంది. దక్షిణ లెబనాన్లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండగా, అక్కడ కనీసం 31 మంది మరణించినట్లు సమాచారం. హెజ్బొల్లా రాకెట్లు, డ్రోన్లతో ఇజ్రాయెల్పై ప్రతిదాడులు చేపడుతోంది. ఇజ్రాయెల్ సైన్యం యుద్ధం మరికొన్ని రోజులు కొనసాగొచ్చని హెచ్చరించింది.యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ ప్రకారం తాజా ఘర్షణల్లో ముగ్గురు అమెరికా సైనికులు మృతిచెందారు. అమెరికా అధ్యక్షుడు ఈ ఆపరేషన్ను ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన సైనిక చర్యల్లో ఒకటిగా అభివర్ణిస్తూ, లక్ష్యాలు నెరవేరే వరకు దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్ చర్చలకు తావులేదని ప్రకటించింది. అమెరికాతో ఎలాంటి చర్చలు జరపబోమని ఇరాన్ నేత...తో

మిగితా 4వ పేజీలో

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై భారత్ ఆందోళన

- ఇజ్రాయెల్, యూఏఈ నాయకులకు ప్రధాని మోదీ ఫోన్



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పశ్చిమాసియాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాంతీయ భద్రత, పౌరుల రక్షణ అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ పలువురు కీలక దేశాధినేతలతో వరుసగా ఫోన్ సంభాషణలు జరిపారు.

మొదటగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి

మిగితా 4వ పేజీలో

# తెలంగాణ పౌరుల కోసం 24×7 కంట్రోల్ రూమ్

- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్లో ప్రత్యేక ఏర్పాట్లు
- విదేశాంగ మంత్రిత్వ శాఖతో నిరంతర సమన్వయం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసింది.తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకుపోయిన తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి అందుతున్న సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుతం ఇరాన్, గల్ఫ్ దేశాలు తదితర ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు లేదా తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు, ఇతర ఇబ్బందులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్ను సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది. అవసరమైన సమన్వయం, సహాయాన్ని అందించేందుకు ప్రత్యేక బృందం సిద్ధంగా ఉందని వెల్లడించింది.


**24ఐ7 కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు**
**(న్యూఢిల్లీ -- తెలంగాణ భవన్):**

వందన బరువా: ౦91 9871999044
సీహెచ్. చక్రవర్తి: ౦91 9958322143
జావేద్ హుస్సేన్: 9910014749
రక్షిత్ నాయక్: ౦91 9643723157

మధ్యప్రాచ్య ప్రాంతంలోని పరిణామాలను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది.

# ఇరాన్పై దాడులు కొనసాగుతాయి

- నాలుగు నుంచి ఐదు వారాలు యుద్ధం సాగొచ్చు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**బలగం టీవీ, వాషింగ్టన్**

ఇరాన్పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్తో యుద్ధం మరో నాలుగు నుంచి ఐదు వారాలపాటు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పూర్తి స్థాయిలో కొనసాగుతోందని ట్రంప్ తెలిపారు. ఈ సందర్భంగా గతంలో తనపై జరిగిన హత్యాయత్నాల ఘటనలను ప్రస్తావించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ప్రోద్బలంతో తనపై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయని ఆరోపించారు. అయితే తాను మొదటిసారిలోనే అతడిని అడ్డుకున్నానని వ్యాఖ్యానించారు. ఇరాన్పై ఆపరేషన్ క్లిష్టమైన దేనని, అయినప్పటికీ విస్తృత స్థాయిలో దాడులు కొనసాగుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. అవసరమైతే ఈ ఆపరేషన్ను నాలుగు నుంచి ఐదు వారాలు కొనసాగించవచ్చునన్నారు.

# ఇరాన్లో చిక్కుకున్న భారతీయ విద్యార్థులు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య దాడులు--ప్రతిదాడులు తీవ్రరూపం దాల్చడంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇరాన్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రత్యేకంగా Isfahan University of Medical Sciences పరిధిలో విద్యనభ్యసిస్తున్న పలువురు భారతీయ విద్యార్థులు యుద్ధ వాతావరణంలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. తమను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు లేదా స్వదేశానికి తరలించాలని భారత ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.విద్యార్థిని ఫాతిమా మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం 25 నుంచి 30 మంది భారతీయ విద్యార్థులు అక్కడే చిక్కుకు పోయామని తెలిపారు. తమ చుట్టుపక్కల పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయని, అవి క్యాంపస్కు ఎంత దూరంలో జరుగుతున్నాయో తెలియకపోయినా చాలా సమీపంలోనే జరుగుతున్నట్లు అనిపిస్తోందన్నారు. డార్మిటరీల్లో ఉన్నప్పటికీ భద్రతపై నమ్మకం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.యూనివర్సిటీ పరీక్షలు, తరగతుల కారణంగా ముందుగానే భారత్కు రాలేకపోయామని తెలిపారు. ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఆన్లైన్ తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ, ఫైనల్ ఇయర్ విద్యార్థులు తప్పనిసరిగా ఆస్పత్రి విధులకు హాజరుకావాలని యూనివర్సిటీ యాజమాన్యం ఒత్తిడి చేస్తోందని పేర్కొన్నారు. డార్మిటరీలను ఖాళీ చేయాలని, వేరే ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు.

# బీజేపీ విభజన రాజకీయాలను తిప్పికొట్టాలి

- ఇండో అమెరికా ట్రేడ్ డీల్ ప్రమాదకరం
- పని చేయండి.. పదవులు అవే వస్తాయి...
- పార్టీ నిర్మాణంపై దృష్టి సారించండి
- దేశ ప్రయోజనాల కోసం ప్రధాని బాధ్యత తీసుకోవడానికి సిద్ధం
- కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు
- వికారాబాద్లో ముగిసిన శిక్షణా కార్యక్రమాలు



**బలగం టీవీ, వికారాబాద్**

లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ ప్రజల అనుమతితోనే అధికారాన్ని ఆశించాలన్నారు. అధికారాన్ని దక్కించుకోవడానికి బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోందని, ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు సాగిస్తున్నదని ఆరోపించారు.వికారాబాద్లో జరిగిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని కాపాడేందుకు బీజేపీ ప్రయత్నాలను అప్రమత్తంగా ఎదుర్కోవాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. అహింస, శాంతి, సత్య సాధన అనే కాంగ్రెస్ మౌలిక సూత్రాలను ఎల్లప్పుడూ పాటిస్తూ ప్రజల్లో నిరంతరం పనిచేయాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ సత్యం, సౌహార్దం అనే ఆదర్శాలపై స్థాపించబడిందని, ప్రజా జీవనంలో ఆ విలువలను ఆచరణలో పెట్టాలని అన్నారు. సమానత్వమే కాంగ్రెస్ సిద్ధాంతాల కేంద్రబిందువని పేర్కొన్నారు. కులం, మతం, వర్గం, లింగం ఆధారంగా ఎలాంటి వివక్ష లేకుండా పార్టీ పనిచేయాలని స్పష్టం చేశారు. అహంకారాన్ని విడిచిపెట్టి ప్రజలతో మమేకమై పని చేయాలని సూచించారు. డీసీసీ అధ్యక్షులు తమ పదవులను అధికార ఆకర్షణగా కాకుండా బాధ్యతగా భావించాలని రాహుల్ గాంధీ సూచించారు. పార్టీ బలోపేతం, ప్రజాసేవ కోసం కృషి చేస్తే ఎలాంటి నాయకత్వ స్థాయికైనా ఎదగవచ్చని హామీ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ప్రతి నెల కనీసం 30 గ్రామాలను పర్యటించి ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతామని ప్రతిజ్ఞ చేశారు. డీసీసీ కార్యాలయాల్లో ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

# మైనింగ్ ఈ-వేలంలో భారీగా అక్రమాలు

- టెండర్ రద్దు చేయాలి
- రిజర్వ్ ఫారెస్ట్పై స్పష్టత లేకుండానే వేలం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగ లేఖ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు బహిరంగ లేఖ రాశారు. సూర్యాపేట జిల్లాలో నిర్వహించిన మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ, టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేసి స్వతంత్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూమిపై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆయన ఆరోపించారు. కీలక సాంకేతిక వివరాలు వెల్లడించలేదని, లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు అందుబాటులో లేవని విమర్శించారు. జియోలాజికల్ నివేదికలు లేకుండానే టెండర్ ప్రక్రియ ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. మినరల్ ఆక్షన్ రూల్స్-2015 నిబంధనలను ఉల్లంఘించారని, తెలంగాణ హైకోర్టు సూచనలను పట్టించుకోలేదని ఆరోపించారు. పర్యావరణ, చట్టపరమైన అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్సీఎల్ ఇండస్ట్రీస్ సంస్థలకు మినరల్ బ్లాక్‌లు కేటాయించడంపై సందేహాలు వ్యక్తం చేశారు. గనుల శాఖ చేపట్టిన ఈ ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధమని విమర్శించారు.

టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఆ నిబంధనలు పాటించలేదని పేర్కొన్నారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని కొనసాగించడం, హైకోర్టు సూచనలను లెక్కచేయకపోవడం, అవసరమైన అనుమతులు లేకుండానే బిడ్డర్లను ఎంపిక చేయడం వంటి అంశాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని లేఖలో వివరించారు. మైన్స్ అండ్ జియాలజీ శాఖ లీగల్ ఆఫీసర్ బ్లాక్‌లకు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారునికి ఇవ్వడానికి నిరాకరించడం కూడా పారదర్శకతపై అనుమానాలను పెంచుతోందన్నారు. ప్రస్తుత వేలం

## 'రూ.1000 కోట్ల వసూలుకే వచ్చారా?'

- ఎంపీ రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్య పోస్టు

వివరాలు 4వ పేజీలో

# కాళేశ్వరం కమిషన్ నివేదిక రద్దుపై హైకోర్టులో విచారణ

- కేసీఆర్, హరీశ్‌రావు తదితరుల పిటిషన్లపై వాదనలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయస్థానం సోమవారం వాదనలు విన్నది.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తరపున ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించగా, కమిషన్ తరపున నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తున్నారు. ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లేకుండానే రాజకీయ ఉద్దేశాలతో కమిషన్‌ను ఏర్పాటు చేసి, తన నాయకత్వంలోని ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేశారని కేసీఆర్, హరీశ్‌రావులు తమ పిటిషన్లలో పేర్కొన్నారు. కమిషన్ నివేదిక కాపీని తమకు అందజేయకుండా ప్రభుత్వం ముందుగా మీడియాకు విడుదల చేయడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని వారు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో డిజైనింగ్ లోపాలు, ప్రణాళికా లోపాలకు సీఎంగా తానే బాధ్యుడినని కమిషన్ ఏ ఆధారాలపై నిర్ణయించిందో వివరించాలని కేసీఆర్ తన పిటిషన్‌లో కోరారు. ప్రభుత్వం అందించిన రికార్డుల ఆధారంగా మాత్రమే నిర్ణయించడం సరికాదని, సంబంధిత అన్ని ఆధారాలను సమర్పించి తన వివరణ తీసుకున్నాకే నిర్ణయానికి రావాల్సి ఉంటుందని వాదించారు. కమిషన్ తనను సాక్షిగా పిలిచి, అదే సమయంలో దోషిగా అభియోగాలు మోపిందని కేసీఆర్ పేర్కొన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా నిర్ణయానికి రావడానికి ముందు చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ ప్రకారం నోటీసు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. తనపై అభియోగాలు మోపిన వారి వివరాలు వెల్లడించలేదని, వాంగ్మూలం ఇచ్చిన వారిని ప్రశ్నించే అవకాశం కూడా కల్పించలేదని పిటిషన్‌లో వివరించారు. వాదనలు కొనసాగుతున్న ఈ కేసులో హైకోర్టు తదుపరి విచారణ తేదీని ప్రకటించనుంది.

# అంబర్‌పేట కుటుంబం ఆత్మహత్య కేసులో నలుగురు అరెస్ట్




- అధిక వడ్డీ వసూలు, వేధింపులే ఆత్మహత్యకు కారణం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ అంబర్‌పేట బాపునగర్‌లో ఒకే ఇంట్లో ఇటీవల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న కేసులో నలుగురు అక్రమ వడ్డీ వ్యాపారులను పోలీసుల అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి సికింద్రాబాద్ జోన్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో డీసీపీ రక్షిత కె.మూర్తి వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 24న హోటల్ వ్యాపారి కడిగేకర్ రామ్‌రాజ్, ఆయన భార్య మాధవి, కుమారుడు శశాంక్ రాజ్ ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. రామ్‌రాజ్ మల్లాపూర్‌లో 'కింగ్స్ బిర్యానీ' హోటల్ నిర్వహించేవాడు. అతను హోటల్ వ్యాపార అవసరాల కోసం జవహర్‌నగర్ మౌలాలికి చెందిన రియల్ ఎస్టేట్, స్క్రాప్ వ్యాపారి మహమ్మద్ వాసి ఉజ్ జమాన్ అలియాస్ ఇర్ఫాన్, మౌలాలి వెంకటేశ్వర నగర్‌కు చెందిన పి.రాజశేఖర్ రెడ్డి, ఓల్డ్ సఫిల్‌గూడ సుధానగర్‌కు చెందిన మహమ్మద్ నవాజ్, మౌలాలి సాదుల్లానగర్‌కు చెందిన సయ్యద్ మజీద్ హైదర్ వద్ద రూ.57 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వారు రోజువారీ వడ్డీ వసూలు చేస్తూ

మిగితా 4వ పేజీలో

# వ్యవసాయ యాంత్రీకరణను వేగవంతం చేయడానికి చర్యలు

- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రికరణను వేగవంతం చేయడం కోసం ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి Sub-Mission on Agricultural Mechanization (SMAM) పథకం కింద పలు వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందజేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఇప్పటికే చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ మరియు మహిళా రైతులకు ప్రాధాన్యంతో యంత్రాలను అందజేస్తున్న ప్రభుత్వం, రైతుల కోరిక మేరకు ఆధునిక సాంకేతిక వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా వ్యవసాయ డ్రోన్లను కూడా సబ్సిడీపై అందజేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ఈ నిర్ణయం మేరకు మొదటి దశలో ప్రతి జిల్లాకు 10 చొప్పున వ్యవసాయ డ్రోన్లను 40 శాతం సబ్సిడీతో, గరిష్టంగా రూ.4 లక్షల వరకు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు (ఫీఉలు) మరియు ప్రాథమిక సహకార సంఘాలకు అందచేయడానికి నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయ డ్రోన్ల వినియోగంతో పిచికారీ సమయం 70--80 శాతం వరకు తగ్గడంతో పాటు ఎరువులు, సూక్ష్మపోషకాలు సమానంగా పంటపై పిచికారీ చేయడం సాధ్యమవుతుందని, కూలీల ఖర్చు తగ్గి రైతులకు లాభం పెరుగుతుందని మంత్రి తెలిపారు. ఇటువంటి డ్రోన్లను సబ్సిడీపై సంఘాలకు అందచేయడం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడిన డ్రోన్లను అందుబాటులోకి తీసుకువచ్చి వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడం ప్రభుత్వ ధ్యేయమన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.
- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో

**31 ఫిర్యాదులు స్వీకరణ**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 31 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# విద్యపై రాజకీయ కక్షలు సహించం..




- బీఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్

**బలగం టీవీ, సిరిసిల్ల:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెప్పుకోసమే విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పనిచేస్తున్నారని ఆరోపించారు. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం కాదని, స్పష్టమైన రాజకీయ ప్రతీకార చర్య కంచర్ల రవి గౌడ్ మండిపడ్డారు. సోమవారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవిగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ విద్యారంగాన్ని స్వర్ణయుగంగా మలిచిన మహానాయకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పై కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగంపై దాడి చేస్తోందని విమర్శించారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలనే రాజకీయ కుట్రలో భాగంగానే గురుకులాలు, విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థలపై అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్కరణలను బలహీనపరచడం వెనుక స్పష్టమైన రాజకీయ కోణం ఉందని తెలిపారు. ఇది అభివృద్ధి వ్యతిరేక దృక్పథమే కాకుండా, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయమని తీవ్రంగా ఖండించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పై కక్షతో పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే ప్రయత్నాలు చేస్తే, అది రాజకీయంగా తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. విద్యా రంగాన్ని రాజకీయ కక్ష సాధింపుల వేదికగా మార్చితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలతో సమాధానం ఇస్తుందని స్పష్టం చేశారు.

విద్యపై రాజకీయాలు ఆపి కేసీఆర్ చేసిన అభివృద్ధిని కాపాడుదామని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్ట శ్రీనివాస్, ఎస్కే అప్రోచ్, ఆరెల్లి వినయ్ కుమార్, సాయి, రాజు, విష్ణు, రాము, నరేష్, వంశీ, నరేంద్ర, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్‌పర్సన్ సహా ప్రజా ప్రతినిధులకు సత్కారం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం, నెహ్రూ నగర్ వారి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి జిందం కళా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్లు దూడం రజిని శ్రీనివాస్, ఎర్ర వెంకటరాజం, మెరుగు మంజుల శ్రీనివాస్, బొద్దుల శ్రీనివాస్, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షులు దూరం శంకర్ అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీమతి జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ.. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తమను మరియు కౌన్సిలర్లను, పద్మశాలి సంఘం అధ్యక్షులను దేవస్థానం ఆధ్వర్యంలో సన్మానించడం పట్ల దేవాలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ సీతారామాంజనేయ స్వామి సాక్షిగా సత్కరించడం తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల తరఫున గెలుపొందిన ప్రజా ప్రతినిధులు అందరూ ఒకే వేదికపై ఉన్నారని పేర్కొంటూ, పార్టీలకతీతంగా స్వామివారి ఆశీస్సులతో సిరిసిల్ల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మూడు సంవత్సరాల క్రితం అప్పటి మంత్రివర్యులు కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) సహకారంతో అభయాంజనేయ స్వామి దేవాలయంలో కమ్యూనిటీ హాల్ పై అంతస్తు నిర్మాణం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి పురపాలక సంఘం నుండి సాధ్యమైనంత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

బిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి మాట్లాడుతూ.. శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. గతంలో కేటీఆర్ సహకారంతో దేవాలయ అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కూడా దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే



దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అలాగే శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

వైస్ చైర్మన్ దార్ల సందీప్ మాట్లాడుతూ, దేవాలయ విశిష్టతను కొనియాడుతూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. మార్కండేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు ఆడెపు శ్రీహరి మరియు కార్యవర్గ సభ్యులు, పుర ప్రముఖులు నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, పద్మశాలి సంఘం అధ్యక్షులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్, వేద పండితులు, పుర ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి జిందం చక్రపాణి కి, మరియు మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు పద్మశాలి సంఘం అధ్యక్షుల వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఆహ్వానం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మై భారత్ ( మినిస్ట్రీ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఎఫైర్స్ ) ఆధ్వర్యంలో అగ్రహారం గ్రామం లోని జేఎన్టీయూ మైదానంలో "జిల్లాస్థాయి క్రీడా" పోటీలు (టోర్నమెంట్) నిర్వహించడం జరుగుతుంది, తేదీ : 06/03/2026 నుండి 07/03/2026 వరకు నిర్వహించబడును , టోర్నమెంట్లో భాగంగా , వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ ,షార్ట్ పుట్ , బ్యాట్మెంటన్ , చెస్ , పై టోర్నమెంట్ నిర్వహించబడును,పోటీల్లో పాల్గొని క్రీడాకారుల వయసు :18 నుంచి 30 లోపు గల పురుషులు మరియు మహిళలు ముందుగానే రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా కోరారు. రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసినదిగా ఆర్గనైజర్స్ దొంతర వేణి హరీష్ :8688295297, జూపల్లి రవి తేజ: 919347461020, వాలంటరీ మారం గణేష్ : 8978583002.



# కాచాపూర్ పాఠశాల స్ఫూర్తితో ప్రతి స్కూల్‌లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం

- రాష్ట్రస్థాయి పురస్కారం పొందిన సిబ్బందిని అభినందించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**బలగం టీవీ, పెద్దపల్లి**

జూలపల్లి మండలం కాచాపూర్ ప్రభుత్వ పాఠశాల స్ఫూర్తితో ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న కాచాపూర్ పాఠశాల సిబ్బందిని సోమవారం కలెక్టరేట్‌లో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పరిశీలనలో మూడు పాఠశాలలకు రాష్ట్రస్థాయి పురస్కారాలు లభించాయని తెలిపారు. అందులో పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కాచాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఒకటిగా నిలవడం గర్వకారణమన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో పరిశుభ్రత, పోషకాహార నాణ్యత, సమయపాలనలో ఈ పాఠశాల ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. ఇతర పాఠశాలలు కూడా ఈ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులకు మెరుగైన భోజన వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పీఎం షేక్, జూలపల్లి మండల విద్యాధికారి సరస్వతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ఉపాధ్యాయులు రాజేందర్ రెడ్డి లను జిల్లా కలెక్టర్ సన్మానించారు.

# భార్య దూరమవ్వడంతో వ్యక్తి ఆత్మహత్య

**బలగం టీవీ, కాల్వశ్రీరాంపూర్**

భార్య కాపురానికి రావడంలేదనే మనస్తాపంతో కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన కందుకూరి రాజ్‌కుమార్ (37) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజ్‌కుమార్ భార్య మౌనిక ఐదేళ్ల క్రితం అతడిని విడిచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తూ తీవ్ర నిరాశకు గురైన రాజ్‌కుమార్ మద్యం అలవాటు చేసుకున్నట్లు తెలిపారు. భార్య తిరిగి రాకపోవడంతో మానసికంగా కుంగిపోయిన ఆయన, ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం తెల్లవారుజామున మృతుడి తల్లి రాజేశ్వరి లేచి చూసేసరికి రాజ్‌కుమార్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న స్థానికులు గమనించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.



# తెలంగాణ ఉద్యమ కళాకారుల సంక్షేమం కోసం వినతిపత్రం..

**బలగం టీవీ, మంచిర్యాల:**

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిరుద్యోగ, వృత్తికళాకారుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ ప్రజానాట్యమండలి ప్రతినిధులు జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో, వృద్ధులైన కళాకారులకు పింఛన్లు, హెల్త్ కార్డులు అందించమని, తెలంగాణ ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించిన కళాకారులకు సముచిత స్థానం కల్పించాలని, రాబోయే బడ్జెట్లో కళాకారుల సంక్షేమం కోసం కొంత శాతం ప్రత్యేకంగా కేటాయించాలని సూచించారు. అలాగే, ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు కల్పించిన రిజర్వేషన్ విధానం తరహాలో, కళాకారులకు కూడా కొంత శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అంతేకాక, వృత్తికళాకారుల కోసం జిల్లా స్థాయిలో కళా ప్రదర్శనలు నిర్వహించడానికి డిపీఆర్ఓ మార్గదర్శకత్వం కావాలని, సాంస్కృతిక సారథిగా పనిచేస్తున్న కళాకారులకు ఉద్యోగ భద్రత కల్పించి, పర్మనెంట్ చేయాలని కూడా ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు రేగుంట చంద్రశేఖర్, మిట్టపల్లి పౌల్, గంగా రామ్, బియ్యాల ఉపేంద్ర, బబ్బర్ రాజేంద్ర, చొప్పదండి కిషన్, మిట్టపల్లి మల్లేష్, బొంకురి రామచందర్, రవి, పుష్ప, రమ్య పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు..

- **మాజీ స్పీకర్‌కు నివాళి అర్పించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీ పాదరావు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ ఆద్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు నిర్వహించగా, కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్ర పటానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రాందాస్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు..

- **మాజీ స్పీకర్‌కు నివాళి అర్పించిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీ పాదరావు జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్ర పటానికి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే, అదనపు ఎస్పీ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సి.ఐ లు రవి,నాగేశ్వరరావు, ఆర్.ఐ లు యాదగిరి, రమేష్, ఎస్.ఐ లు కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా దుద్దిల్ల శ్రీపాద రావు జయంతి వేడుకలు..

- **ఇల్లంతకుంట మండలంలోని పలు ఆసుపత్రి లో పండ్లు పంపిణి..**

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**



ఇల్లంతకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు 89వ జయంతి వేడుకలను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇల్లంతకుంట మండలంలోని పలు ఆసుపత్రి లో పండ్లు పంపిణి చేశారు.
అనంతరం కాంగ్రెస్ పార్టీ మాజి మండల అధ్యక్షులు అంతగిరి బాలపోచయ్య, పసుల వెంకన్న లు మాట్లాడుతూ.. శ్రీపాద రావు రాజకీయ జీవితం ధన్వాడ గ్రామ సర్పంచ్ గా మొదులు పెట్టి మంథని నుండి శాసనసభ్యునిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్ గా అటూ కాంగ్రెస్ పార్టీలోనూ ఇటు ప్రజాజీవితంలో మచ్చలేని రాజకీయ నాయకుడిగా పేరు సంపాదించుకున్నారని ఆయనను అజాత శ్రతువు గా పిలుచుకుంటారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, మైనార్టీ మండల అధ్యక్షులు జమాల్, సోషల్ మీడియా అధ్యక్షులు కాసుపాక రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వేములవాడలో దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి

**బలగం టీవీ, వేములవాడ:**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి సందర్భంగా వేములవాడలో ఘనంగా జ్ఞాపకార్థం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) ఉపాధ్యక్షులు భీమ్ రాజ్ కనకరాజ్ ఆధ్వర్యంలో, ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పించి స్మరించారు. అనంతరం, రాజన్న ఆలయం ముందు ఉన్న యాచకులకు పండ్లు పంపిణీ చేయడం ద్వారా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచనల మేరకు ఏర్పాటుచేయబడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శ్రీపాదరావు ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ సమాజానికి సేవ చేయడం ద్వారా నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, లతా, అనిల్, రమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 164 అర్జీలు..

- **నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 164 దరఖాస్తులు రాగ, జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల అధికారులు సత్వరంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



## హోలీ పండుగను సురక్షితంగా, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జరుపుకోవాలి..

- **డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ పై ప్రత్యేక దృష్టి.**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు హోలీ పండుగను ఆనందభరితంగా, సురక్షిత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. హోలీ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరఫున భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
యువకులు అత్యుత్సాహం ప్రదర్శించకుండా ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్,



స్టంట్లు చేయడం, ముగ్గురు లేదా నలుగురు ఒకే వాహనంపై ప్రయాణించడం, బైక్‌లకు సైలెన్సర్ తొలగించి నడపడం వంటి చర్యలు ప్రమాదకరమని, వీటిపై కఠినంగా వ్యవహరిస్తామన్నరు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, హోలీ రోజున మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వారి తల్లిదండ్రులపై, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఇతరులపై బలవంతంగా రంగులు వేయడం, అసభ్యంగా ప్రవర్తించడం, మహిళలను వేధించడం, గొడవలు సృష్టించడం, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హోలీ అనంతరం స్నానాల కోసం చెరువులు, కాల్వలు, అధిక నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలు, లోతైన నీటిలోకి వెళ్లడం ప్రమాదకరమని, గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ పరస్పర గౌరవంతో, ఇతర మతాల వారిని గౌరవిస్తూ మతసామరస్యంతో హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## సెస్ ఉద్యోగుల విధుల బహిష్కరణ..

- **సెస్‌లో అసిస్టెంట్ హెల్పర్ల 72 గంటల విధుల బహిష్కరణ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
సెస్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ హెల్పర్లు తమ సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఈ నెల 11 నుంచి 14 వరకు 72 గంటల పాటు విధులు బహిష్కరించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే. ఈశ్వర్ రావు, రాష్ట్ర కార్యదర్శి నలువాల స్వామి ప్రకటించారు.
సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అసిస్టెంట్ హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం సెస్ ఎండికి ఐదుసార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని వారు పేర్కొన్నారు. ప్రతి నెల చెల్లించాల్సిన ఎఫ్‌టీఏను గత ఎనిమిది నెలలుగా నిలిపివేశారని, 2025 సెప్టెంబర్ నెలలో ఇవ్వాల్సిన వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వలేదని ఆరోపించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల




కుటుంబ సభ్యులను రెగ్యులరైజ్ చేయలేదని, కార్మికులకు లీవ్ ఎన్క్యాష్మెంట్ విధానం అమలు చేయడం లేదని తెలిపారు. ఏహెచ్‌లుగా పిలువబడే కార్మికులందరూ ఐటీఐ ఎలక్ట్రికల్ పూర్తి చేసినవారేనని, సాంకేతికంగా వారు టెక్నీషియన్లేనని పేర్కొన్నారు. అయితే సెస్‌లో అసిస్టెంట్ హెల్పర్లుగా పిలుస్తూ తక్కువ వేతనాలు చెల్లించడం కార్మిక వ్యతిరేక విధానమని విమర్శించారు. ఈ విధంగా వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 11 నుంచి 14 వరకు 72 గంటల పాటు విధులు బహిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కాలంలో వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా సెస్ ఛైర్మన్, ఎండీలు యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ సమావేశంలో సెస్ కమిటీ అధ్యక్షుడు కర్నాల అనిల్ కుమార్, కార్యదర్శి ఎస్. శ్రీనివాసరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర మల్లేశం, కోశాధికారి ఎస్. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ మున్సిపల్ పాలనపై బీఆర్ఎస్ కౌన్సిలర్ల తీవ్ర ఆగ్రహం..



- **వేములవాడ మున్సిపల్ చైర్మన్ చెరో రెండున్నరేండ్ల పదవీకాలంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి..**
- **ఫిబ్రవరి నెల సమావేశం ఎందుకు పెట్టలేదు?**
- **మీడియా ప్రచారానికే పరిమితమైన అభివృద్ధి.. వార్డు ప్రజల సమస్యలు మీకు పట్టవా?**
- **చైర్మన్ పదవీకాలంపై వెంటనే స్పష్టత ఇవ్వాలి**
- **విపక్ష కౌన్సిలర్ల డిమాండ్**

**బలగం టీవీ, వేములవాడ:**
వేములవాడ మున్సిపల్ పాలకవర్గం తీరుపై స్థానిక బిఆర్ఎస్ కౌన్సిలర్లు మరియు సీనియర్ నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు తమను అభివృద్ధి చేస్తారనే నమ్మకంతో గెలిపిస్తే, ప్రస్తుత పాలకవర్గం ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తోందని వారు విమర్శించారు. ఫిబ్రవరి నెల ముగిసిన మున్సిపల్ సమావేశం ఎందుకు నిర్వహించడం లేదని, అసలు పాలకవర్గం ఏర్పడినప్పటి నుండి ఒక్క సమావేశం కూడా ఎందుకు పెట్టలేదని నిలదీశారు. వార్డుల్లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే, వాటిని చర్చించి పరిష్కరించాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ?కేవలం మీడియాలో ప్రచారం చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ, పట్టణ అభివృద్ధిపై లేదని వారు ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ పదవీకాలం విషయంలో 'చెరో రెండున్నర ఏళ్లు' అనే ప్రచారంపై ప్రజలకు వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనుల విషయంలో వెనుకడుగు వేస్తున్న పాలకవర్గం ప్రజలకు సమాధానం చెప్పాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు రామతీర్థపు మాధవి రాజు, వాసాల లావణ్య, సీనియర్ నాయకులు నిమ్మశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, మారం కుమార్, కొండ కనుకయ్య, సలీమ్, కందుల క్రాంతి కుమార్, జోగిని శంకర్, గూడూరు మధు, నిమ్మశెట్టి రాజు, రేగుల రాజేశం, పబ్బ మహేష్, మంత సందీప్, మామిండ్ల కనకయ్య, గోసుకుల నరసయ్య, లింగంపల్లి శ్రీనివాస్, గోపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్య భవనాలను త్వరితగతిన నిర్మించాలి..

- భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**


పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అంగన్వాడీలు, గ్రామపంచాయతీ భవనాలు, హెల్త్ సబ్ సెంటర్లు తుది దశలో ఉన్న నిర్మాణాలను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, 15 ఆర్థిక సంఘం నిధులు, ఎన్ హెచ్ ఎం, డీఎంఎఫ్టీ వంటి ఇతర నిధులతో మహిళా సమాఖ్య, గ్రామ పంచాయతీ, అంగన్వాడీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, ప్రహరీల నిర్మాణాలు, కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో నిర్మాణ పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ మండలాలకు మంజూరు చేసిన మహిళా సమాఖ్య భవనాల పనులను మూడు రోజుల్లో ప్రారంభించాలని, ఇప్పటికే ప్రారంభించిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, తుది దశలో ఉన్న గ్రామపంచాయతీ, అంగన్వాడీ, హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణాలను పూర్తి చేసి, వాటిలో నీటి, విద్యుత్, టాయిలెట్ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అయితే, ఇంకా ప్రారంభించని పనులపై మండల ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలను పరిష్కరించి, త్వరితగతిన పనులను పూర్తి చేయడానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవోలు తమ పరిధిలోని ఏపీవోలు, పంచాయతీరాజ్ శాఖ ఏఈలతో సమావేశం ఏర్పాటు చేసి, మంజూరైన నిర్మాణాలు, వాటి ప్రస్తుత పరిస్థితి, పనుల పురోగతి పై సమగ్ర సమాచారం పొందాలని సూచించారు.

పంచాయతీరాజ్ శాఖ ఈఈ, డీఆర్డీఓ, డీడబ్ల్యూఓ, డీఈఓ అధికారులు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహించి, క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరపాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిసరాల పరిశుభ్రత కోసం డస్ట్ బిన్, హ్యాండ్ వాష్ ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులను పక్కాగా చేపట్టాలని సూచించారు. సభలో డీఆర్డీఓ గీత, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ సుదర్శన్ రెడ్డి, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, ఎంపీడీవోలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామభివృద్ధిలో ప్రతి మహిళా భాగస్వామ్యం కావాలి

- ఇల్లంతకుంట సర్పంచ్ యం. రాజు



**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట గ్రామ పంచాయతీ అభివృద్ధి లో ప్రతి మహిళ భాగస్వామ్యం కావాలని ఇల్లంతకుంట సర్పంచ్ యం. రాజు కోరారు.మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళల ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ యం. రాజు మాట్లాడుతూ, మహిళలు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు మాత్రమే కాకుండా మార్పుకు మార్గదర్శకులని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించి, ప్రతి అర్హుడికి వాటి లబ్ధి చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కుట్టు యంత్ర శిక్షణ, పశుపోషణ, చిన్నతరహా వ్యాపారాలు, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఉపాధి హామీ పనులు వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ప్రతి మహిళ కనీసం ఒక ఉపాధి మార్గాన్ని ఎంచుకుని ఆదాయం పెంపొందించుకోవాలని కోరారు.గ్రామసభలో తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యా మరియు ఆరోగ్య సదుపాయాల మెరుగుదలపై విస్తృత చర్చ జరిగింది. మహిళలు తమ సమస్యలను, సూచనలను ధైర్యంగా వెల్లడిస్తూ గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శశికళ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, జిపిఓ కవిత, ఏఎన్ఎం సుహాసిని, ఎస్‌జిహెచ్ ఆడిట్ సీఆర్పీ మౌనిక, ఉపసర్పంచ్ మూగు నాగరాజు శర్మ, వార్డు సభ్యులు దయ్యాల శ్రీలత, రేగుల కార్తీక్, ఎర్రోజు దీపిక, మామిడి సుశీల, మామిడి శ్రీనివాస్, చేరాల వంశీకృష్ణ, రాకం సుమన్, కొట్టే ప్రమీల, అంతటి శ్రీకాంత్, కునబోయిన ఎల్లవ్వ, కునబోయిన రఘు, మహిళ సంఘాల నాయకులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధం తీవ్రతరం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేయడంతో దౌత్యపరమైన పరిష్కారం దూరమవుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈ యుద్ధ ప్రభావం ప్రపంచ ఆర్థిక రంగంపై పడుతోంది. కొన్ని నౌకాయాన సంస్థలు రాకపోకలను నిలిపివేశాయి. పలు పశ్చిమాసియా దేశాలు గగనతలాన్ని మూసివేయడంతో వేలాది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన Strait of Hormuz వద్ద ఉద్రిక్తతలు పెరగడంతో చమురు ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా అమెరికా--ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ ప్రతీకార చర్యలు, ప్రాంతీయ మిలీషియా దాడులతో పశ్చిమాసియా అల్లకల్లోలంగా మారింది. ప్రాణనష్టం పెరుగుతుండగా, అణు కేంద్రాల భద్రతపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. తక్షణమే దౌత్యపరమైన చర్చలు ప్రారంభం కాకపోతే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సుప్రీం నేత ఖమేనీని, సీనియర్ అధికారు లను అంతం చేయడాన్ని జీర్ణించుకోలేక పోతున్న ఇరాన్ ఇజ్రాయిల్‌పై, గల్ఫ్ లోని అరబ్ దేశాలపై పెద్ద ఎత్తున క్షిపణు లను, డ్రోన్లను ప్రయో గించింది. మరోవైపు ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయిల్‌పై హిజ్బొల్లా రాకెట్లు, డ్రోన్లతో దాడి చేసింది. బీరూట్ దక్షిణ శివారు ప్రాంతాలపై ఇజ్రా యిల్ వైమానిక దాడులు చేసిందని లెబనాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఖమేనీ మరణానంతరం మరింత రెచ్చిపోయిన అమెరికా, ఇజ్రాయిల్ సైని కులు ఆదివారం ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి స్థావరా లపై బాం బుల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. అంతేకాక ఇరాన్ యుద్ధ నౌకలను కూడా అవి ధ్వంసం చేశాయి. కువైట్‌లో అనేక అమెరికా యుద్ధ విమానాలు నేల కూలాయి. అయితే పైలట్లు సురక్షితంగా బయట పడ్డారు. అరబ్ దేశాలపై క్షిప ణులు, డ్రోన్లతో ఇరాన్ విరుచుకు పడడాన్ని ఖండిస్తూ అమెరికా, బహ్రైన్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏ ఈలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. పశ్చిమాసియాలో చెలరేగిన హింస రోజు రోజుకూ తీవ్రతరం అవుతోంది.

ఇరాన్‌తో మొదలైన ఘర్షణ నాలుగు వారాల పాటు కొనసాగవచ్చంటూ అమెరికా అధ్య క్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన నేప థ్యంలో పశ్చిమాసియా నగరాలలో నివ సిస్తున్న భారతీయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక గల్ఫ్ దేశాలలో పరిమిత సంఖ్యలలో బేస్‌మెంట్ షెల్టర్లు, భవనాలలో బాంబు షెల్టర్లు ఉండడమే దీనికి కారణం. ఇరాన్‌పై అమెరికా జరుపుతున్న దాడులకు ప్రతిగా వైమానిక దాడులు జరగవచ్చు నంటూ గల్ఫ్ దేశాలలో సైరన్లను మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దీంతో గల్ఫ్‌లో పెద్ద సంఖ్యలో ఉపాధి పొందుతున్న కేరళీయులు భయం భయంగా



# సిరిసిల్లలో ఘనంగా ఇఫ్తార్ విందు

- పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న, రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు

**బలగం, టీవీ సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని 26వ వార్డు కౌన్సిలర్ నెలూట్ల నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రంజాన్ మాస పవిత్రతను ప్రతిబింబించే ఈ ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి వారు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉపవాస దీక్షను ముగించుకున్న వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమాజంలో సౌహార్దత, ఐక్యత, పరస్పర గౌరవ భావాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు శాంతి, సౌభ్రాతృత్వంతో జీవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'రూ.1000 కోట్ల వసూలుకే వచ్చారా?'

- ఎంపీ రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్య పోస్టు

**బలగం టీవి, హైదరాబాద్**

లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన అధికారిక ఖాతాలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గాంధీ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసినట్లు వెలువడిన వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్ పోస్టు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎక్స్‌లో కేటీఆర్ స్పందిస్తూ, "హలో రాహుల్‌గాంధీ.. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఇూక్మీజజ) ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. "మీరు ఇప్పుడు సీఎం దగ్గర రూ.1000 కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా?" అని ప్రశ్నించారు. అదేవిధంగా, "100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 ఇతర వాగ్దానాల పురోగతిని కూడా సమీక్షించండి" అంటూ సూచించారు. కేటీఆర్ చేసిన ఈ పోస్టుపై కాంగ్రెస్ వర్గాలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రాజకీయాల్లో తాజా వ్యాఖ్యలు మరింత వేడిని పెంచుతున్నాయి.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలపై భారత్ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

బెంజమిన్ నెతన్యాహుతో మోదీ మాట్లాడారు. పశ్చిమాసియాలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై భారత్ ఆందోళనను వ్యక్తం చేశారు. యుద్ధ వాతావరణంలో సాధారణ ప్రజలే తీవ్రంగా నష్టపోతారని, కాబట్టి పౌరుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శత్రుత్వ చర్యలను వీలైనంత త్వరగా నిలిపివేసి శాంతి దిశగా చర్యలు చేపట్టాలని పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ లో వెల్లడించారు. ప్రస్తుత ప్రాంతీయ పరిస్థితులపై చర్చించామని, తాజా పరిణామాలపై భారత ఆందోళనను తెలియజేశామని పేర్కొన్నారు. పౌరుల రక్షణ అత్యంత ముఖ్యమని, శత్రుత్వానికి త్వరగా ముగింపు పలకాలని స్పష్టం చేశారు. అమెరికా--ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్పై క్షిపణి దాడులు చేపట్టిన అనంతరం పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. ప్రతీకారంగా ఇరాన్ పలు ప్రాంతాలపై దాడులు కొనసాగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గల్ఫ్ దేశాలపై డ్రోన్లు, క్షిపణి దాడులు జరగడంతో అక్కడ నివసిస్తున్న భారతీయుల భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్తో కూడా ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. యూఏఈపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. కష్టకాలంలో యూఏఈకి భారత్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.యూఏఈలో లక్షలాది మంది భారతీయులు నివసిస్తున్న నేపథ్యంలో వారి రక్షణకు ఆ దేశ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. భారతీయుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ, ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి భారత్ మద్దతిస్తుందని పేర్కొన్నారు. గత రెండు రోజులుగా యూఏఈపై ఇరాన్ జరిపిన దాడుల్లో ముగ్గురు మృతి చెందగా, దాదాపు 58 మంది గాయపడినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. క్షతగాత్రుల్లో ఒక భారతీయుడు కూడా ఉన్నట్లు సమాచారం. దీంతో భారత రాయబార కార్యాలయం అప్రమత్తమై, అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తోంది. అవసరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దేశ భద్రతా పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం సమీక్ష చేపట్టింది. ప్రధాని మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమైంది. పశ్చిమాసియా పరిణామాలు, భారత ప్రయోజనాలు, విదేశాల్లోని భారతీయుల భద్రత, చమురు సరఫరాలు, వ్యూహాత్మక అంశాలపై చర్చించినట్లు సమాచారం. ప్రాంతీయ ఉద్రిక్తతలు భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపవచ్చో సమగ్రంగా విశ్లేషించారు.

# అంబర్‌పేట కుటుంబం ఆత్మహత్య కేసులో నలుగురు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర వేధింపులకు గురిచేశారు. మితిమీరిన వడ్డీ డిమాండ్ చేశారు. వడ్డీ చెల్లించలేని పరిస్థితుల్లో ఖాళీ చెక్కులపై బలవంతంగా సంతకాలు చేయించుకోవ డంతోపాటు ప్రామిసరీ నోట్లు, భూమి పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇంటికి వెళ్లి అవమానించడం, బెదిరించడం వంటివి చేశారు. ఈ వేధింపులు భరించలేక కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. ఘటన స్థలంలో లభ్యమైన సూసైడ్ నోట్‌లో తమ మరణాలకు నలుగురే కారణమని, వారి పేర్లు, వారు పెట్టిన బాధలను రాశారు. వారు ఆత్మహత్య చేసుకున్న రోజు రాత్రి కూడా నిందితులు డబ్బు డిమాండ్ చేస్తూ తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని బెదిరించినట్టు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. రామ్‌రాజ్ కుమార్తె అమూల్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి కాల్ డాటా ఆధారంగా రికార్డ్స్ కూడా పరిశీలించి కేసును ఛేదించారు. నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించారు. అధిక వడ్డీకి డబ్బు అప్పుగా ఇచ్చినట్టు.. తిరిగి చెల్లింపు కోసం వారిపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్టు నిందితులు అంగీకరించారు. పూచీకత్తుగా ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, ఆస్తి పత్రాలను బలవంతంగా సేకరించినట్టు కూడా అంగీకరించారు. దీంతో నలుగురుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రామ్‌రాజ్ 12 ఖాళీ చెక్కులు, 6 ప్రామిసరి నోట్లు, ఒప్పంద పత్రాలు, యాదాద్రి భువనగిరి జిల్లా గాంధీ మాల్ గ్రామంలో ఉన్న మూడు ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలు, బాండ్ పేపర్లు, మృతుడి కుటుంబ సభ్యులను బెదిరించడానికి నిందితులు ఉపయోగించిన మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, ఓయు ఏసీపీ జి.జగన్, అంబర్ పేట ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్ కుమార్, డీఐ మహ్మద్ హఫీజుద్దీన్, ఎస్ఐలు సురేష్, తరుణ్ పాల్గొన్నారు.